

గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



### రూ.2,245 కరెంటు బిల్లు వచ్చింది..

నేను, నా భర్తతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నం. మాకు ముగ్గురు పిల్లలు. కూలీ పనులకు పోతేగాని పూట గడవదు. నెలకు రూ.1500 కిరాయి చెల్లిస్తూ అద్దె ఇంట్లో ఉంటున్నం. ప్రతినెలా తక్కువ కరెంటు బిల్లు వస్తుంది. మే నెలకు సంబంధించి రూ.2,245 బిల్లు వచ్చింది. కూలీ పనులు చేసుకుంటూ జీవించే తాము ఇంత బిల్లు ఎక్కడి నుంచి కడతాం. పేదలకు ఉచిత కరెంటు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. మాకు ఉచిత కరెంటు కోసం దరఖాస్తు చేసుకున్న బిల్లు వస్తున్నది. మా కాలనీలో చాలా మందికి వేల రూపాయల బిల్లులు వచ్చాయి. ఇదేం గవర్నమెంటో అర్థం కావడం లేదు. ఉచిత కరెంటు అని వేలకు వేల బిల్లులు వేస్తున్నారు. గిసోంటి గవర్నమెంట్‌ను గిప్పటి వరకు జిందగిల చూడలేదు.

**- పూజ, కూలీ, రణదీవనగర్, ఆదిలాబాద్.**



# సమస్యల వెల్లువ

## ప్రజావాణిలో కరెంటు బిల్లులు, పింఛన్లు, ఇతర సమస్యలపై దరఖాస్తులు

- రెండు బల్బులు, ఫ్యాన్లు ఉన్న ఇంటికి వేలల్లో విద్యుత్ బిల్లులు
- రెండు నెలలుగా పింఛన్ ఇవ్వడం లేదని తరలివచ్చిన దివ్యాంగులు



ఆదిలాబాద్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

**పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రెండు నెలల తర్వాత ప్రజావాణి కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో జనం పోటెత్తారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ 62 మంది కలెక్టర్ రాజర్షి షాకు విన్నవించుకున్నారు. కరెంటు బిల్లులు, దివ్యాంగుల పింఛన్లు, ఇతర సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. ప్రజల సమస్యలు విన్న కలెక్టర్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.**

*- ఆదిలాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ)*



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు ఇవ్వడానికి తరలివచ్చిన జనం

## సత్వరమే పరిష్కరించాలి

**ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బూ గుప్తా**

ఉట్నూర్, జూన్ 10 : గిరిజనుల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పాల్గొని మాట్లాడారు. గిరిజనులు మారుమూల పల్లెల నుంచి వస్తారని, వారి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన గంగాదేవి తనకి ఏదైన ఉపాధి కల్పించాలని, నేరేడిగొండ మండలంలోని నాగమలార్డ్ గ్రామానికి చెందిన ఆత్రం జంగుబాయి తనకి అటవీ హక్క పత్రం ఇప్పించాలని, పెంబి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పద్మ తనకి గురుకుల పాఠశాల అడ్మిషన్ కావాలని, ఉట్నూర్ మండలంలోని హనుమాన్ నగర్‌కు చెందిన నితిన్ తనకి ఆర్థిక సహాయం కావాలని ఇలా పింఛన్, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ సమస్యలపై పలువురు దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి మనోహర్, ఆర్‌సీవో గంగాధర్, ఏవో రాంబాబు, ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

## సమయపాలన ఏదీ?

**11 గంటలకు వచ్చిన అధికారులు**

ఎదులాపురం, జూన్ 10 : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 10.30 గంటలకు జిల్లా అధికారులు వచ్చారు. కలెక్టర్ రాజర్షి షా 10.30 గంటలకు వచ్చినప్పటికి జిల్లా అధికారుల మాత్రం ఒక్కొక్కరు 11 గంటల వరకు చేరుకున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ పలు శాఖల అధికారులు రాలేదా? అని సిబ్బందిని అడిగారు. ప్రజావాణికి జిల్లా అధికారులు సమయానికి రాకపోవడంపై పలువురు మండిపడుతున్నారు.

## సమస్యల పరిష్కారానికే ఫిర్యాదుల విభాగం

**నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



నిర్మల్ కలెక్టర్‌కు అర్జీలు అందిస్తున్న ప్రజలు

నిర్మల్ అర్బన్, జూన్ 10 : ప్రజా సమస్యల పరిష్కారానికే ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు భారీ సంఖ్యలో హాజరై కలెక్టర్‌కు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీదారులు అందించిన ఫిర్యాదులను స్వీకరించి అక్కడే ఉన్న సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్ పాల్గొన్నారు.



పింఛన్లు రావడం లేదని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు

### పింఛన్లు రావడం లేదు..

తమకు ప్రభుత్వం అందజేసే పింఛన్లు సక్రమంగా రావడం లేదని, ఇతర సమస్యలను పరిష్కరించాలని పలువురు దివ్యాంగులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికలు ఉన్నందున మే నెల వరకు పింఛన్లు ఇచ్చారని, రెండు నెలల నుంచి పింఛన్ డబ్బులు రావడం లేదని ఉట్నూర్‌కు చెందిన ఉస్కమెల్ల శంకర్ అనే దివ్యాంగుడు కలెక్టర్‌కు వినతిపత్రం అందించాడు. తాను పలుమార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేసినా మంజూరు కావడం లేదని నార్నూర్ మండలంలోని భీంపూర్‌కు చెందిన దివ్యాంగుడు పొచిరాం సూచించారు. తమకు ఇస్తున్న రైల్వే పాసులు కేవలం తెలంగాణలో మాత్రమే వర్తిస్తున్నాయని ఇతర ప్రాంతాలకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కలెక్టర్‌ను కోరారు.



అధిక కరెంట్ బిల్లులపై ఆదిలాబాద్ కలెక్టర్‌కు ప్రజావాణిలో ఇచ్చిన అర్జీతో రణధీవనగర్ కాలనీవాసులు

### వేలల్లో కరెంటు బిల్లులు

పట్టణంలోని రణధీవనగర్ కాలనీవాసులకు అధిక బిల్లులు రావడంతో వారు బిల్లుల పత్రాలు పట్టుకుని ప్రజావాణికి తరలివచ్చారు. కూలీ పనులు చేసుకుని బతికే తమకు నెలకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు బిల్లులు వచ్చాయని ఆవేదన చెందారు. తమ వద్ద కూలర్లు, ఏసీలు ఏమీ లేకున్నా ఇంత బిల్లులు ఎలా వచ్చాయని ఆందోళన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తామని చెప్పిందని, తాము రెండు గదుల కిరాయి ఇంట్లో ఉంటూ రెండు బల్బులు, రెండు ఫ్యాన్లు మాత్రమే వాడుతున్నా వేల రూపాయల బిల్లులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రోజుంతా కూలీ పనులు చేసుకుంటేనే పూట గడుస్తుందని అంత బిల్లులు ఎలా చెల్లించాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిక బిల్లులు విషయంలో చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

## తొలకరి పలకరింపేనా?

- జాడలేని వర్షాలు.. ఆందోళనలో రైతన్నలు
- స్ప్రింక్లర్ల సహాయంతో నీరు అందిస్తున్న అన్నదాతలు

బోథ్, జూన్ 10 : తొలకరి పలకరించడంతో అన్నదాతలు సాగు బాట పట్టారు. వారం రోజులుగా పత్తి విత్తనాలు అధికంగా విత్తుతున్నారు. నేలలోని తడితో విత్తనాలు ఉబ్బి మొలకలు బయటకు వస్తున్నాయి. ఈ తరుణంలో నీటి తడులు చాలా అవసరం. కానీ.. వరుణుడు జాడ లేకపోవడంతో నీటి చుక్క కోసం రైతన్నలు ఆకాశానికేసి ఎదురు చూస్తున్నారు. కౌఠ(బీ), కన్గుట్ట, సాకెర, సొనాల, పొచ్చెర, కుచ్లాపూర్, ధన్నూర్(బీ), బోథ్ గ్రామాల పరిధిలో పత్తి విత్తనాలు వేయడం పూర్తయింది. వరుణుడు కరుణించకపోవడంతో చివరకు నీటి సౌకర్యం ఉన్న రైతులు స్ప్రింక్లర్ల సహాయంతో నీటిని అందిస్తున్నారు.



స్ప్రింక్లర్ల సహాయంతో నీటిని అందిస్తున్న రైతు

## ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఎదులాపురం, జూన్ 10 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద ధ్రువీకరణ పత్రాలను డీఈవో ప్రణీత పరిశీలించారు. జిల్లాలో భాషా పండితులు 220 మంది, వ్యాయామ ఉపాధ్యాయులు 25 మంది అప్‌గ్రేడ్ కాగా.. సోమవారం సర్టిఫికెట్లను పరిశీలించారు.



సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న డీఈవో ప్రణీత

# జొన్నల పైసలేవీ?

- నెల రోజులుగా డబ్బుల కోసం ఎదురుచూపు
- పెట్టుబడులకు ఇప్పించాలంటూ కలెక్టర్‌కు దరఖాస్తు

ఆదిలాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ) : యాసంగిలో రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించింది. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేశారు. ఆదిలాబాద్, బేల, జైనథ్, హస్నాపూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, బోథ్, తాంసి మార్కెట్ యార్డుల్లో సేకరించారు. 3.60 లక్షల క్వింటాళ్ల పంటను రూ.3,180 మద్దతు ధరతో కొనుగోలు చేయగా.. ఇందుకు సంబంధించిన డబ్బులు రూ.100.14 కోట్లను ప్రభుత్వం చెల్లించాలి. డబ్బుల కోసం రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు. దీంతో రైతులు తమకు రావాల్సిన డబ్బుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదిలా ఉండగా.. వానకాలం సాగులో భాగంగా రైతులు భూములను సిద్ధం చేసుకున్నారు. జొన్నల పైసలు రాక పెట్టుబడి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మే మొదటి వారంలో పంటను విక్రయించగా.. సోమవారం వరకు కూడా డబ్బులు అందలేదు. వానకాలం పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జొన్నల డబ్బులు ఇప్పించాలంటూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు రైతు సంఘాల నాయకులు దరఖాస్తు అందజేశారు.



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోళ్లు(ఫైల్)

### నేటి నుంచి డబ్బులు జమ చేస్తాం

**- ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మేనేజరు, ఆదిలాబాద్**

యాసంగిలో రైతుల వద్ద నుంచి సేకరించిన జొన్నల డబ్బుల పంపిణీ సోమవారం నుంచి కొనసాగుతోంది. ఇప్పటివరకు రూ.30 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. ఇంకా రూ.84 కోట్లు పంపిణీ చేయాలి. ప్రభుత్వం నుంచి రూ.44 కోట్లు మంజూరు అయ్యాయి. ఎనిమిది రోజుల్లో డబ్బులు పంపిణీ పూర్తి చేస్తాం.

### నెల రోజులైనా పైసలు రాలేదు..



నేను ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మే 9న 75 క్వింటాళ్ల జొన్నలు విక్రయించా. మూడు రోజులకు పైసలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని అధికారులు చెప్పారు. నెల రోజులు గడిచినా ఇంకా డబ్బులు రాలేదు. డబ్బులు ఎప్పుడు వస్తాయని అధికారుల చుట్టూ తిరుగుతున్నా. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. విత్తనాలు, ఎరువుల కోసం అప్పులు చేయాల్సి వస్తున్నది. అధికారులు పైసలు తొందరగా అందేలా చూడాలి.

**- రామగిరి విఠల్, రైతు, బరంపూర్, తలమడగు మండలం**

### పెట్టుబడి కోసం అవస్థలు



వానకాలం సీజన్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా 3.60 లక్షల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేశారు. రూ.100.14 కోట్లు రైతులకు రావాల్సి ఉంది. వానకాలం పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేయాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి రైతుల డబ్బులు తొందరగా పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

**- బండి దత్తాత్రి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్**




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులతో నాయకులు

## ఇంటి పట్టాలు ఇవ్వండి

ఎదులాపురం, జూన్ 10 : మావల మండలంలోని 170 సర్వే నంబర్‌లో నివసిస్తున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు వెంకట్‌నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కాలనీవాసులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 100 కుటుంబాలు ఎనిమిదేండ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం ఇంటి పట్టాలు, నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు గౌరాల సుభాష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎర్రాజి హరీశ్, జిల్లా నాయకులు బగ్గి శ్రీకర్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు దండేకర్ వామన్, నాయకులు పెరిక గంగమ్మ, తారాబాయి, రఫీక్, మనోజ్, తౌఫిక్, రమాకాంత్, వర్ష ఉన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట మహిళలు

## డబుల్ బెడ్రూంలు ఇప్పించండి

**ఆర్డీవో కోమల్‌రెడ్డికి మొర**

భైంసా, జూన్ 10 : భైంసా పట్టణంలో 460 మందికి అప్పటి తహసీల్దార్ డబుల్ బెడ్రూంల ఇళ్లను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారని, వెంటనే అవి ఇప్పించాలని పలువురు మహిళలు ఆర్డీవో కోమల్ రెడ్డికి సోమవారం మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎనిమిది నెలలుగా కిరాయి ఇండ్లలో ఉంటున్నామని, అద్దె కట్టలేక అప్పుల పాలవుతున్నామని ఆవేదన చెందారు. వెంటనే డబుల్ బెడ్రూంలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు.